

రామసాస్త్రి

'భూతవైద్య శంభుదాస్' అన్న బోర్డు వీధిగేటుకి తగిలించివున్న యింటి ముందు ఆగింది ఒక కారు.

ఆ కారులోంచి ఒక సూటువాలా, గ్లాస్కో పంచలు కట్టుకొన్న యిద్దరు పెద్దమనుషులు దిగారు. సూటువాలా గోడకు తగిలించి వున్న బోర్డును పరిశీలనగా చూశాడు. ఆ బోర్డుకు పైభాగంలో ఆ వైపు యీ వైపూ తెల్లని రెండు చిన్న అస్థిపంజరం బొమ్మలున్నాయి. ఆ రెండింటికి మధ్య ఒక పుర్రెకు అటు యిటూ క్రాసుగా పెట్టిన రెండు మోంజేతి ఎముకలు గల బొమ్మ వుంది.

కింది మేటరు పెద్దగా చదివాడు సూటువాలా.

"భూతవైద్య విద్వాన్, భూత చక్రవర్తి శంభుదాసుగారు మిమ్మలను నిరంతరమూ పట్టి పీడిస్తున్న భూత ప్రేత పిశాచములను వెళ్ళగొట్టగలరు. శంకిని, ఢాకిని మొదలగు పిశాచములు ఆయనను చూసిన పారిపోవును. అంతియేగాక వీరు భూస్థాపితమైన నిధినిక్షేపములను కనిపెట్టగలరు. మీ యింట్లో మీ పూర్వీకులు ఎన్నియో నిధులు శత్రువాతపడకుండా రహస్యంగా దాచి వుండవచ్చు. భూత చక్రవర్తి శ్రీ శంభుదాసుగారిని కలుసుకొని వాటి రహస్యాలు తెలుసుకోండి. అశేష భూత ప్రేత పిశాచములను తమ సేవకులుగా వుపయోగించుకొనుచున్న శంభుదాసుగారికి మీ సమస్యలను పరిష్కరించుట చిటికెలో పని."

అంతా చదివి, "నో. నా కెందుకో నమ్మకం కలగడం లేదు, వీటిమీద" అన్నాడు సూటువాలా.

అతని పక్కనేవున్న బుర్రమీసాలా యన వులిక్కిపడి ఒకసారి తన గ్లాసొక్క పంచె సరిచేసుకొని, భుజంమీద తుండు సర్దుకొని భయంగా గేటు వాకిలివైపు చూసాడు. "నాయనా! ఆయన్ని వాడు, గీడు అని సంబోధించకు. మనకు మంచి జరగడానికి బదులు చెడు జరుగుతుంది. మన పని అయ్యేంతవరకు ఆయనతో జగడం పెట్టుకోకు" అన్నాడు.

అతని పక్కనేవున్న బట్టతలాయన "యిదంతా నీవల్లే జరిగింది బావా. వాణ్ని అమెరికాకి పంపొద్దంటే విన్నావా. నా కూతుర్నిచ్చాను. నా కూతురు మొగుడు 'ఫారెన్ రిటర్న్డ్' అనిపించుకోవాలని విర్రవీగావే. ఇప్పుడు చూడు ప్రతిదీ కాలికేస్తే మెడకు, మెడకేస్తే కాలికి లంకె వేస్తున్నాడు. ఇక అందరం కలిపి ఏడుద్దాం" అంటూ మండిపడ్డాడు.

మాటువాలాకు బుర్రమీసాలాయన పిల్లనిచ్చిన మామ, బట్టతలాయన జన్మ నిచ్చిన తండ్రి.

"నాన్నా! మామయ్య నేమీ అనకు. వాళ్ళు మూఢనమ్మకాలు లేవు. కనుక ఈ భూతవైద్యుడి మీద విశ్వాసం లేదం టాను. అంతే" అన్నాడు మాటువాలా.

"చూసావా వీడి మాటలు, వీణ్ని అమెరికాకి పంపి నువ్వు..."

"బావా మన్నించురకో. అమెరికాకి పోతే మాత్రం హిందూ సాంప్రదాయం పోవా లని ఎక్కడుంది. అమెరికా ప్రజలకు మాత్రం దయ్యాలమీద, భూతాలమీద నమ్మకం లేదంటావా. బాగా ఆలోచించి చూడు. ఇప్పుడొచ్చే దయ్యాల సినిమా లన్నీ అమెరికాలో తయారయినవే. అమెరికాలో సంవత్సరాల తరబడి హౌస్‌ఫుల్ కలక్షన్లతో ఆడినవే. వాటిని చూసే కదా మనవాళ్ళు హిందీలోనూ, యితరభాషల్లోనూ తీసిపారేస్తున్నారు." అల్లుడిని వెనకేసుకొచ్చాడు. బొర్రమీసా లాయన.

మామగారి మాటలకు స్తన్నయి పోయాడు మాటువాలా. మామగారి కింత పరిశీలనా జ్ఞానం వుందని యింతవరకు అతను గమనించలేదు. పాశ్చాత్య నాగరి కతమీద వ్యామోహం ఉండబట్టే మామ ఎంతో ఖర్చుపెట్టి తనను అమెరికాలో నాలుగేళ్ళు పెట్టింది.

తను ఆ నాలుగేళ్ళు ఎన్ని స్వర్గ సుఖాలు అనుభవించాడక్కడ. మామగారు చెప్పినట్లు అక్కడ హారర్ మూవీస్ అంటే జనం ఎలా చెవి కొసుకుంటారో తనకు తెలుసు. ఉదాహరణకు డ్రాకులా సీరియల్స్ ఎగ్జారిస్టులాంటి పిక్చర్లే. ఏ దేశంలో కూడా విజ్ఞానం పెరిగేకొద్దీ, మూఢనమ్మకాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. అయితే అక్కడివారు వీటిని పరిశీలనా దృక్పథంతో చూస్తు న్నారు.

ఇంతలో యింకొకారు వచ్చి ఆగింది అక్కడ.

"ఒరే అబ్బాయ్. మనం వెళ్దాం వద లోపలికి. ముందుపోతే ముందు మన పని అవుతుంది" అన్నాడు బట్టతలాయన కొడుకుతో.

ముగ్గురూ లోపలకు నడిచారు. డ్రయివరు బయటే ఉండిపోయాడు.

కాంపౌండ్ లోపల, భూతవైద్యుని యింటిముందు ప్రాంగణంలో పెద్ద షామియానా కట్టబడి వుంది. షామియానా క్రింద పరచిన చాపలమీద రకరకాల వ్యక్తులు కూర్చొని వున్నారు. ఎదురుగా విలువైన కాళీమాత విగ్రహముంది. విగ్రహం ముందు నాలుగు పెద్ద పళ్ళాల నిండుగా కుంకుమ. ఇంకో నాలుగు పెద్ద పళ్ళాల నిండుగా వీభూది వుంది. కాళీ విగ్రహం నాలుక చాచి భయంకరంగా వుంది. కాళీ విగ్రహానికి ఒక పక్కగా పెద్దపీట. దానిమీద నల్లని గుడ్డ పరిచి వుంది.

సూటువాలా శ్రీధర్, ముందు తన మామ నరసయ్య, తండ్రి రాజయ్య జనం మధ్య దారిచేసుకొని నడువగా వారి వెనుకనే వెళ్ళి కాళీమాతకు అతి దగ్గరగా కూర్చున్నాడు. శ్రీధర్ అక్కడ కూర్చున్నవాళ్ళందరినీ పరిశీలించి చూశాడు. వాళ్ళలో ముప్పాతిక వరకూ అంతా పల్లెటూరివాళ్ళు ఏదో మత్తుమందు తిన్నట్లు ఊగుతున్నారు. తమలాంటి వాళ్ళు కొద్దిమంది మాత్రమే ఉన్నారు.

అసలింతకూ వీళ్ళిక్కడకు రావడానికి కారణం నరసయ్య.

నరసయ్య రాజయ్య సన్నిహిత బంధువులు. నరసయ్య తన కుమార్తె రమ, రాజయ్య కుమారుడు శ్రీధర్ కిచ్చి వైభవంగా వివాహం చేసాడు. కొన్ని లక్షలు కట్నమిచ్చి దాంతో పాటు విజయవాడలో ఒక పెద్ద భవనం కూడా అల్లుడికి కొనిచ్చాడు. అల్లుడు హోదా ఘనంగా వుండాలనే ఉద్దేశంతో నాలుగేళ్ళపాటు అతన్ని అమెరికాలో చదువులనిమిత్తం ఉంచాడు.

నరసయ్య రాజయ్యలు వియ్యంకులే గాక వ్యాపారంలో పార్ట్‌నర్స్ కూడా. పెద్దగా చదువుసంధ్యలు లేకపోయినా వారి అదృష్టం బాగుండి వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లి లక్షలు సంపాదించారు.

అయిదేళ్ళ కిందట ఒకసారి వ్యాపారనిమిత్తం మద్రాసు వెళ్ళాడు నరసయ్య. అక్కడి స్నేహితుడి బలవంతం మీద అర్థంగాకపోయినా ఒక ఇంగ్లీషు సినిమాకు పోయాడు. ఆ సినిమా పేరు 'మెకన్నాస్ గోల్డ్'. పక్కనున్న మిత్రుడు తెలుగులో ట్రాన్స్‌లేట్ చేసి చెప్తుంటే విన్నాడు. ఏది అర్థమయినా కాకపోయినా సినిమా ఆఖర్లో హీరో కనుగొన్న అపారమైన సంపదను చూసి మురిసిపోయాడు. అప్పుడే అతనిలో ఒక అనుమాన బీజం పడింది. తన పూర్వీకులు జమీందారులు. కాబట్టి వాళ్లు తమ సంపదను ఎక్కడో దాచి వుండొచ్చుని. క్రమేణా ఆ బీజం మొలకెత్తి

మొలకెత్తి అతని మనసులో ఒక పెద్ద వటవృక్షమై కూర్చుంది. ఆ రోజునుంచి రాత్రిళ్ళు 'మేకన్న బంగారం, మేకన్న బంగారం' అంటూ కలవరించేవాడు. అతని భార్య 'మేకన్న ఎవరండీ' అంటే 'నీకు తెలియదు మహ్వారుకో' అని భార్యను గదమాయించేవాడేగానీ తన అనుమానం చెప్పేవాడు కాదు.

ఇటీవల అల్లుడు ఫారిన్‌నుంచి తిరిగి వచ్చి విజయవాడలో కాపురం పెట్టి నప్పుడు కూతురు అల్లుడుతోబాటు 'కింగ్ సాల్మన్స్ మైన్స్' అన్న మరో ఇంగ్లీషు సినిమా చూడడం తటస్థించింది. దాంట్లో గూడా ఎన్నో వర్గపోరాటాలూ, ఎంతో మంది మరణించడం జరిగాక ఒక పెద్ద కొండగుహలో పెట్టెలలో నిక్షిప్తమై వున్న వజ్రవైడూర్యాలు, బంగారు నగలతో కూడిన అపరిమితమైన సంపద కనిపిస్తుంది. దీంతో తన పూర్వీకులు ఎక్కడో కోట్లు ఖరీదుచేసే వజ్రాలు, బంగారునగలు ఇనుప భోషాణాల్లో పెట్టి భూస్థాపితం చేసి ఉంటారని అతని కిప్పుడు పూర్తి నమ్మకం కలిగింది.

ఇండియాకు తిరిగివచ్చిన అల్లుడికి ఏదో ఒక పని కల్పించాలి. వీధి దొరికితే అగ్రతారలతో సెవన్టీ ఎం.ఎం.లో, హిందీ తెలుగు భాషల్లో భారీఎత్తున సినిమాలు తీయడానికి అల్లుణ్ని ఉపయోగించ వచ్చునేది సరసయ్య ఆశ. అందుకే నాలుగో మనిషికి తెలియకుండా తన వియ్యంకుడితోను, అల్లుడితోను రహస్యాలోచన చేసి ప్రస్తుతం కొత్తగా విజయవాడకు వచ్చిన భూతవైద్య శంభుదాస్‌ని సంప్రదించాలని వచ్చారు.

ఇదీ పూర్వ వృత్తాంతం.

"మామయ్యా. ఇది పచ్చి మోసం" అన్నాడు శ్రీధర్.

"మహ్వారుకో" అందుకొన్నాడు పక్కనేవున్న తండ్రి.

ఇంతలో జనంలో కలకలం బైలుదేరింది. 'జై కాళీమాతా' అంటూ పెద్దగా వినిపించింది. ఆ వెనుకనే ఆపాదమస్తకం నల్లని గౌను ధరించిన ఒక అజానుబాహుడైన వ్యక్తి కాళీవిగ్రహం వెనుక వైపునుండి వచ్చాడు. మనిషి ఎర్రగా, లావుగా వున్నాడు. ఎడమచేతిలో చిన్న త్రిశూలం, కుడిచేతిలో బొమిక, ముఖాన వెడల్పుగా సింధూరం రంగులో కపాలం బొమ్మ.

అతని గౌనుమీద ఛాతీకి మధ్యగా పెద్ద కపాలం బొమ్మ వుంది. దానికి అటువైపు యిటువైపు క్రాసుగా వుంచబడిన బొమికల బొమ్మలున్నాయి. వెనుకనే సన్నగా పీలగావున్న యిద్దరు శిష్యులు అలాంటి గౌనులే ధరించి అతన్ని అనుసరించారు. అయితే వాళ్ళ గౌనులమీద ఉన్న బొమ్మలు చిన్నవిగా వున్నాయి.

కూర్చున్న జనం అంతా లేచి నిలబడి భక్తిగా నమస్కరించారు. భూతవైద్యుడు




ఒక్క చూపులో అందర్నీ పరిశీలించి కాళీమాత ముందున్న పీటమీద పద్మాసనం వేసి కూర్చున్నాడు. ఆయన కూర్చున్న అనంతరం అందరూ కూర్చున్నారు.

ఓ పది హేను నిముషాలు ఏవేవో మంత్రాలు చదువుతూ కాళీమాత విగ్రహం పాదాలముందు కుంకుమ చల్లుతూ గడిపాడు. తరువాత కళ్ళు తెరిచి ఒక పళ్ళెంచుట్టూ బొమిక తిప్పాడు. అంతే. పళ్ళెంనిండుగా తాయెత్తులు తయారయ్యాయి. అందరూ నోరు తెరచుకొని చూస్తుండిపోయారు.

ఇంతలో జనాన్ని వరుసక్రమంలో వుంచి ఒక్కొక్కరిగా పంపసాగారు అతని శిష్యులు. భూతవైద్యుడు వాళ్ళ సమస్యలను తెలుసుకొంటూ కొంత మందికి విభూతి, మరి కొంతమందికి కుంకుమ, ఇంకొంతమందికి తాయెత్తులు ఇస్తున్నాడు.

అందరూ కాళీమాత ముందున్న పళ్ళెంలో తమకు తోచింది వేస్తున్నారు. ఎవరూ పది రూపాయలకు తక్కువ వేయడంలేదు. ఓ గంట గడిచేసరికి అంతా వెళ్ళిపోయారు. శిష్యులు పళ్ళెంలోని డబ్బంతా లెక్కపెట్టి డబ్బంతా భద్రంచేశారు.

ఇక అక్కడ మిగిలిపోయింది రెండు కార్లలో వచ్చినవారు మాత్రమే. వాళ్ళు తమ విషయాలు ప్రత్యేకంగా మాట్లాడదల్చుకున్నారు. శిష్యులు మొదట నరసయ్య దగ్గరకువచ్చి 'రహస్యమా' అని అడిగారు. అవునన్నాడు నరసయ్య.

దాంతో శిష్యులు రెండవసారి కార్లో వచ్చినవారితో ఏదో మాట్లాడి, వాళ్ళను కొద్దిసేపు బయటవుండమని చెప్పారు. వాళ్ళు అలాగేనని వినయంగా చెప్పి బయటవున్న తమ కారు వద్దకు వెళ్ళిపోయారు.

భూతవైద్యుడు కాళీమాత పాదాల దగ్గర బొమికతో నేలమీద ఆ చివర నుంచీ యీ చివరివరకు గీచి, "కాళీ

మాత మీకు శుభం చేకూరుస్తుంది. మీరు వచ్చింది ఏ భూత ప్రేత పిశాచాలను పారద్రోలడానికి కాదని, ఒక నిధి రహస్యం తెలుసుకోవడానికని మాత చెబుతోంది. నిజమేనా?..." అన్నాడు.

"అయ్యయ్యో...ఆగండి స్వామీ" అంటూ అటూయిటూ చూసిన నరసయ్య "గోడకు చెవులుంటాయి స్వామీ. చిన్నగా మాట్లాడుకొందాం" అన్నాడు భయంభయంగా.

భూతవైద్యుడు భయంకరంగా నవ్వాడు. అతని నవ్వుకు ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. "మూర్ఖ ప్రజలారా. మనం మాట్లాడుకునే మాటలు మనకు తప్ప యితరులకు వినబడవు. ఎంత పెద్దగా మాట్లాడినా" వికటాట్టహాసం చేశాడు భూతవైద్యుడు.

"చెప్పండి. నిధి ఎక్కడుందని మీ అనుమానం. ఆ అనుమానం మీ కెందుకు వచ్చింది..." అన్నాడు అంతలోనే గంభీరంగా మారి.

నరసయ్య వినయంగా "స్వామీ,మా పూర్వీకులు జమీందారులు. కోట్ల సంపదతో తులతూగేవారు. మా హయాం వచ్చేసరికి లక్షాధికారుల స్థాయికి దిగజారాం. అయితే మా ముత్తాతగారు తన ముత్తాతగారు ఎక్కడో కొన్నికోట్ల విలువచేసే వజ్రాలు, బంగారు నగలు దాచారని, దాన్ని తాను తెలుసుకోలేక పోయానని మా తాతగారితో చెప్పి చనిపోయాడట. మా తాతగారు చనిపోతూ ఈ విషయం మా నాన్నతో చెప్పి చనిపోయాడట. అదేవిధంగా సంవత్సరం క్రితం మా నాన్నగారు చనిపోతూ చివరి మాటగా యిది నాకు చెప్పి చనిపోయాడు. తరతరాలుగా మా తాతముత్తాతలు అంతా గాలించివేశారు. కనుక యింట్లో యిక ఎక్కడా నిధివుండదని నా అనుమానం కానీ మా తండ్రి చనిపోయినరోజు నుంచీ యీరోజువరకూ రాత్రిళ్ళు నా మంచంచుట్టూ ఘల్లుఘల్లుమని గజ్జెల చప్పుడు వినిపిస్తోంది. దీన్నిబట్టి చూస్తే ..." తనకున్న అనుమానాలకు కొంత కల్పనను జోడించి తన నమ్మకాన్ని భూతవైద్యుడి మీద రుద్దాడు

"...ఆ సంపదకి వారసుడివి నువ్వేనని తెలుస్తోంది భక్తా. ప్రయత్నిస్తే ఆ సంపద తప్పక నీదవుతుంది."

"అందుకే గద స్వామీ మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చింది. ఇది మీవల్లనే నెరవేరాలి" రెండు చేతులెత్తి నమస్కరించాడు. అతను తిట్టినా కొట్టినా తనకు సంపద దొరికితే చాలు అనుకుంటున్నాడు నరసయ్య. రాజయ్య కూడా రెండు చేతులెత్తి భక్తితో నమస్కరించాడు. శ్రీధర్ మాత్రం మౌనంగా వుండిపోయాడు. భూతవైద్యుడు కోపంగా అతను వేసుకొన్న బూట్లవైపు చూసాడు మిగతా వాళ్ళు తమ చెప్పుల్ని దూరంగా వదిలి వచ్చి కూర్చుంటే యితను నిర్లక్ష్యంగా

బాట్లతో సహా వచ్చి కూర్చుండడం భూతవైద్యుడికి కోపం తెప్పించింది.

"భక్తా! నీకు నిధి దొరికే మార్గం చెబుతాను. ఒక్కడివే రా" అంటూ లేచాడు భూతవైద్యుడు. అతన్ని అనుసరించాడు నరసయ్య.

ఇద్దరూ లోపలకు వెళ్ళిన అరగంటకు తిరిగివచ్చి యథాప్రకారం ఎవరి స్థానాల్లో వాళ్ళు కూర్చున్నారు. ముగ్గురికీ కాళీమాత ముందున్న పళ్ళెంలోని కుంకుమను ప్రసాదంగా పెట్టసాగాడు భూతవైద్యుడు. పెద్దవాళ్ళిద్దరూ దోసిలిపట్టి భక్తిగా దాన్ని అందుకొని కళ్ళద్దుకొంటే, శ్రీధర్ 'నో నా కవసరంలేదు' అంటూ తిరస్కరించాడు.

భూతవైద్యుడు అతనివైపు గుర్రుగా చూసాడు ముగ్గురూ అక్కడ్నించి బయలుదేరారు.

"అదేమిటి మామయ్యా. మనకు తెలియకుండా ఆయన విధిరహస్యం కవి పెట్టేది. యిందులో ఏదో మోసం ఉంది" అన్నాడు శ్రీధర్.

"మనం మోసపోవాల్సిన అవసరం లేదు బాబూ. విధి పరిశోధనలో మనం ముగ్గురం కలసే వుంటాం" అన్నాడు నరసయ్య.

దాంతో శ్రీధర్ మౌనంగా వుండిపోయాడు

* * *

భూతవైద్యుడు చెప్పినట్లు మరుసటి వారం కూడా ముగ్గురూ భూతవైద్యుడు దగ్గరకు వెళ్ళారు. ఆరోజు మిగతా వాళ్ళంతా వెళ్ళిపోయిన తరువాత 'జై. కాళీమాతా' అంటూ చేయి చాచాడు. కాళీమాత హస్తంలోంచి భూతవైద్యుడి చేతిలో ఏదో వ్రాసిన కాగితం టప్పున రాలిపడింది. అందరూ ఆశ్చర్యంగా చూశారు.

"రేయ్ మూర్ఖభక్తా, కాళీమాత వ్రాసిన వర్తమానం చదవరా" అంటూ ఆ మడిచిన కాగితాన్ని శ్రీధర్‌కు అందించాడు.

శ్రీధర్‌కు నోళ్ళు మండిపోయింది. పక్కనే తండ్రి, మామయ్య వుండడంతో నోరెత్తలేకపోయాడు. మౌనంగా అది అందుకొని చదివాడు. అంతే. వెంటనే భూతవైద్యుడి కాళ్ళ మీద సాష్టాంగపడిపోయాడు

"స్వామీ! నన్ను క్షమించండి. మీ శక్తి తెలియక హద్దుమీరి ప్రవర్తించాను. యికనుంచి మీరు చెప్పినట్లే వింటాను" అన్నాడు.

భూతవైద్యుడు విజయగర్వంగా నవ్వాడు.

"చూసారా నా సామర్థ్యం. ఎటువంటి మూర్ఖుల్ని సైతం నేను దాసానుదాసుల్ని చేసుకోగలను."

నరసయ్య, రాజయ్య యిద్దరూ చెంపలు వాయించుకొన్నారు.

"రేయ్ మూర్ఖా నావెంట రారా. నీకు హితోపదేశం చేస్తాను" అంటూ లోపలికి

నదిచాడు భూతవైద్యుడు. 'చిత్తం' అంటూ అతన్ని అనుసరించాడు శ్రీధర్.

లోపలికి వెళ్ళగానే "స్వామీ, ఇవన్నీ మీకెలా తెలుసు" భయంభయంగా అడిగాడు శ్రీధర్.

"మూర్ఖా! ఇదంతా నా తపఃశక్తి ప్రభావంరా. ఇప్పుడు నిన్ను పిలిచింది ఎందుకంటే ఈ విషయం మీ తండ్రికి, మావయ్యకు చెప్పమంటావా అని అడుగుదామని."

"వద్దు స్వామీ. మీకెంత కావాలన్నా సమర్పించుకుంటాను. ఆ పని మాత్రం చేయకండి."

"ఎంతిస్తావు?"

"ఎంతో మీరే అడగండి స్వామీ."

"అయిదువేల రూపాయలిస్తావా?"

"అమ్మో, అంతా!" నోరు తెరిచాడు శ్రీధర్.

"దీంట్లో గూడా బేరాలా. అయితే నీ యిష్టం" అన్నాడు భూతవైద్యుడు.

శ్రీధర్‌కు ఆ రహస్యం బయటపడేకంటే అయిదువేల రూపాయలివ్వడమే ఎంతో ఉత్తమంగా తోచింది.

"రెండు రోజుల్లో నేనే స్వయంగా వచ్చి మీకా డబ్బు అందజేస్తాను స్వామీ" అన్నాడు శ్రీధర్ యిక తప్పదన్నట్లు.

తిరిగి యిద్దరూ కాళీమాత దగ్గరకు వచ్చారు.


"ఇక మనం నిధి పరిశోధనలో దిగుదాం. రాబోయే అమావాస్య అర్ధరాత్రి పన్నెండు గంటలకు నిధి పరిశోధన మొదలుపెడదాం" అంటూ సమయం నిర్ణయించాడు భూతవైద్యుడు.

దానికి అందరూ అంగీకరించారు.

వాళ్ళు వెళ్ళిన తర్వాత పిచ్చిగా నవ్వుకొన్నాడు భూతవైద్యుడు. తన జిమ్మిక్స్ నమ్మినవాళ్ళని బ్లాక్‌మెయిల్ చేయడం అలవాటు. భారతదేశంలో ఎక్కువ భాగం అవిద్యావంతులు. చదువుకొన్న వాళ్ళు కూడ పాపభీతి కలవారు. దాంతో ఇలాంటి దొంగమాంత్రికులు, పనిలేని బైరాగులు, సంసారసుఖం కోరే సన్యాసులు యధేచ్ఛగా, ఏ ప్రమాదంలేకుండా సుఖంగా బతుకుతున్నారు.

ఆరోజు శ్రీధర్ ప్రవర్తన అర్థంచేసుకొన్న శంభుదాసు అతని రహస్యాలు కనుక్కోవడానికి తన శిష్యుల్ని మామూలు దుస్తుల్లో అతన్ని ఫాలో కమ్మని చెప్పాడు. దాంతో వాళ్ళు అతని క్లబ్బు స్నేహితులకు బాగా డబ్బుపెట్టి అసలు రహస్యం కనుక్కొన్నారు.

అదేమిటంటే దాదాపు లక్ష రూపాయలు రేసుల్లో పోగొట్టుకొని అందుకు గాను సుమారు ఏడులక్షల ఖరీదుచేసే మామగారిచ్చిన భవనం తాకట్టుపెట్టాడని, ఆ విషయం బయటపెడతా ననేసరికి శ్రీధర్ భూతవైద్యుడికి లొంగిపోయాడు. అదేవిధంగా నిధి బైటపడితే తనకు పాతికవేలు యివ్వాలనీ ఈలోగా మూతో




కంటికి తెలియకుండా నరసయ్య దగ్గర నుంచి అడ్వాన్సుగా అయిదువేలు తీసుకున్నాడు భూతవైద్యుడు.

* * *

అనుకొన్నట్లు ఆ అమావాస్యనాడు నరసయ్య తన కుటుంబ సభ్యులను విజయవాడలో వున్న కూతురు యింటికి పంపాడు. అందరూ పల్లెలో వున్న నరసయ్య యింటికి చేరుకున్నారు. అది ఎన్నో శతాబ్దాల క్రితం కట్టిన పురాతన భవనం. ఆ రాత్రంతా భూతవైద్యుడు ఏవో మంత్రాలతో ఇల్లంతా పసుపు కుంకుమ కలిపిన బియ్యపుగింజలు చల్లి, తెల్లవారిందాకా అక్కడక్కడా గునపాలతో తవ్వించాడు ఏమీ దొరకలేదు. అలా ప్రతి అమావాస్య రాత్రి తవ్విస్తూనే వున్నాడు. కాని నిధి ఎక్కడా బైటపడలేదు. అయితే తన మామ, తండ్రితో పాటు శ్రీధర్ కూడా ఇప్పుడు తప్పనిసరిగా భూతవైద్యుడిని నమ్ముతున్నాడు.

భూతవైద్యుడు వాళ్ళని నిరాశపడనివ్వటంలేదు. ఏవేవో కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాడు. అంతో యింతో సంపాదిస్తూనే వున్నాడు.

ఒకరోజు కాళీమాత ముందు కూర్చుని ప్రార్థనచేసిన శంభుదాసు "నరసయ్యా! మీ పూర్వీకులకు ఎక్కడయినా గెస్ట్ హౌస్ లాంటిది ఉండేదా" అనడిగాడు. నరసయ్య చాలసేపు ఆలోచించాడు. ఉన్న

ట్లుంది అతని మెదడులో ఒక మెరుపు మెరిసింది.

"అవును స్వామీ. సముద్రపొడ్డున బెస్తపాలెం పక్కన మాకో గెస్ట్‌హౌస్ వుండేది. ఇప్పుడది శిథిలమైపోయింది. ఎవరూ ఉండడంలేదు."

"అదే నరసయ్యా, అక్కడ నిధి వుందని మాత చెబుతోంది. ఈసారి వచ్చే పౌర్ణమి రాత్రికి లగ్నం పెడుతున్నాను, ఆరాత్రే మన ప్రయాణం. ఆ రోజుకి కార్లు సిద్ధంచేయ్" అంటూ ఆజ్ఞాపించాడు భూతవైద్యుడు.

గెస్ట్‌హౌస్ సంగతి గుర్తొచ్చేసరికి నరసయ్యకు బాగా నమ్మకం కలిగింది.

"నిజమే స్వామీ. ఎవరికీ దొరకకుండా మా పూర్వీకులు సంపదను అక్కడ దాచుంటారు. మీరు కోరినట్లు అన్ని ఏర్పాట్లుచేసి ముందురోజు చెబుతాను స్వామీ" అన్నాడు, అప్పుడే నిధి దొరికినంత సంబరంగా.

అనుకొన్న విధంగానే ఆ పౌర్ణమి రాత్రికి అన్నీ సిద్ధంచేశాడు నరసయ్య. రాత్రి తొమ్మిదిగంటలకు అంతా భోజనాలుచేసి సముద్రపు ఒడ్డునున్న గెస్ట్‌హౌస్‌వైపు బయలుదేరారు. మొదటి కారులో డ్రైవరు అతని ప్రక్కనే నరసయ్య, వెనకసీట్లో తనమంత్రతంత్రాల దుస్తులతో కూర్చొనున్నాడు శంభుదాసు.

వెనకకార్లో శ్రీధర్ కారు డ్రైవ్ చేస్తూంటే అతని తండ్రి ప్రక్కనే కూర్చుని వున్నాడు. వెనకసీట్లో భూతవైద్యుడి ఇద్దరు శిష్యులూ తగు సరంజామాతో కూర్చునివున్నారు.

కార్లు రెండూ ఓ పదిమైళ్ళు ట్రంకు రోడ్డుమీద ప్రయాణించి తరువాత తూర్పువైపు తిరిగి మట్టిరోడ్డున ప్రయాణించసాగాయి. మధ్య మధ్య ఎన్నో పల్లెలు దాటుతూ సుమారు రెండుగంటలు ప్రయాణం సాగించి ఒక పల్లె చేరుకున్నారు. పల్లె నిశ్శబ్దంగా నిద్రపోతోంది. దూరంగా సముద్రపు అలలు వెన్నెల్లో తెల్లగా మెరుస్తూ ఎగసెగసి పడుతున్నాయి. పల్లె ప్రక్కనే సన్నని బండి దారి ఉంది. ఆ దారినే రెండుకార్లు ప్రయాణించి సముద్రానికి ఫర్లాంగు దూరంలో శిథిలావస్థలో ఉన్న ఒక భవనంముందు ఆగాయి. ఆ భవనానికి ఒకవైపుగా రెండు తాటిచెట్లు మాత్రం వున్నాయి.

కార్లలో నుంచి అందరూ దిగారు. డ్రైవరు కారుని రివర్స్‌చేసి పెట్టాడు. ఆ శిథిల భవనానికి వెనగవైపుగా అర మైలు దూరంలో సముద్రమంచునే కొన్ని గుడిసెలున్నాయి. అది బెస్తపాలెమని చెప్పాడు నరసయ్య.

"ఇదే స్వామీ! నేను చెప్పిన గెస్ట్‌హౌస్. మా తాత హయాం వరకు ఇక్కడ మాకు ఉప్పు కొటార్లు ఉండినవట. తరువాత వాటిని పట్టించుకోలేదు. ఆ వ్యాపారం అంతటితో ఆగిపోయింది. మా తాత హయాంలో నా చిన్నప్పుడు




ఎప్పుడో ఒకసారి వచ్చాము. కాబట్టి యీ ఊరు, ఈ బంగళా గుర్తున్నాయి. ఈ బంగళా వైభవం ఆనాటితోనే పోయింది" అన్నాడు.

శ్రీధర్, అతని తండ్రి రాజయ్య వింటూ మౌనంగా వుండిపోయారు. భూతవైద్యుడు ఏమాత్రం ఆలస్యంచేయకుండా తన శిష్యుల్ని పంపి సముద్రం లోంచి నీళ్ళు తెమ్మన్నాడు. అతని శిష్యులు కారులోవున్న రెండు బిందెలు తీసుకొని నరసయ్య తోడురాగా బంగాళాఖాతం వైపు ఇసుకలో నడిచిపోయారు.

తరువాత వాళ్ళు తెచ్చిన నీళ్ళు చల్లి ఆ శిథిలభవనం ఎదుట ముగ్గువేశాడు. తరువాత ముగ్గు మధ్యలో పసుపుకుంకుమతో ఇంకో ముగ్గువేశాడు. దాని మధ్యలో ఒక పుర్రె, దానికి అటూ ఇటూ క్రాసుగా రెండు బొమికలు పెట్టాడు. మూడు మంచి నిమ్మకాయలు తీసుకొని ఒక్కొక్క దాన్ని రెండు చెక్కలుగా కోసి పసుపు కుంకుమలు అద్ది అందులో పెట్టాడు. తరువాత కారుడిక్కీలోంచి కోడిని తీసి శిష్యులు, దాని కాళ్ళుకరు, తలొకరు పట్టుకోగా మంత్రోచ్చరణ చేస్తూ భూత వైద్యుడు దానిపీక రెండుగా కోసేశాడు. దాని రక్తం ముగ్గుమధ్యలో పదేట్లు చేసి దాన్నికూడా ముగ్గు మధ్యలోకి విసిరే శాడు.

సముద్రపు అంచున గుడిసెల్లో నివసిస్తున్న బెస్తవాళ్ళ అనాగరికులుగా వుంటారు. వాళ్ళకు చదువుసంధ్యలు వుండవు. పొద్దున లేచిందే తడవు, సముద్రం మీదకు వెళ్ళి చేపలు పట్టడం సాయంత్రం పొద్దుకువచ్చి మధ్యదగారులకు అంతకో ఇంతకో అమ్మడం, వాళ్ళు యిచ్చిన నాలుగు కాసులతో పక్కనున్న

పల్లెకువెళ్ళి గంజి నూకలు తెచ్చుకొని కాసుకుతాగడం, ఇంతే వారి పని. అయితే వీరిలో ఒక కట్టు వుంది. వాళ్ళ పల్లె పెద్ద ఎంతచెబితే అంత. వాళ్ళ కట్టుబాటు ప్రకారం రోజుకొకరు, తెల్లవార్లూ మేలుకొని పల్లెను కాపలా కాయాలి. ఆ కాపలాకు ముఖ్యకారణం తమ వలలను, తెప్పలను, శత్రువులు దొంగిలించుకు పోకుండా ఉండేందుకు. అదేవిధంగా ఆ రాత్రి కాపలావున్న పల్లెవాడొకడు రహస్యంగా తాటిచెట్టు వెనుకనుండి అంతా గమనించి పల్లెవైపు పరుగెత్తుకువెళ్ళాడు. భవనం ముందున్న వీళ్ళు వాడ్ని గమనించలేదు వాడు పల్లెపెద్దను లేపి విషయమంతా చెప్పాడు.

దాంతో పల్లెపెద్ద "ఓరేయ్. గంగానమ్మ తల్లికి చేతబడి చేస్తున్నార్రో. ఇంక సముద్రం ఎండిపోద్దిరో. మనమిక ఎట్టా బతకాల్రో" అంటూ వెర్రికేకలు పెట్టాడు. దాంతో పల్లెంతా నిద్రలేచింది

పల్లెపెద్ద ముందు పరుగెత్తుతూండగా వెనుక, దొరికింది చేతబట్టుకొని మిగిలిన బెస్తవాళ్ళు అతని వెనకనే పరుగెత్త సాగారు.

దూరం నుంచి వినవస్తున్న గోల, గుంపుగావస్తున్న మనుషుల్ని చూడగానే నరసయ్యలో వణుకు మొదలయింది. శ్రీధర్, అతని తండ్రి కారు దగ్గరకు వచ్చి నిలబడ్డారు.

"స్వామీ! ఇక వెళ్దాం. అదుగో పల్లె వాళ్ళు వస్తున్నారు. వాళ్ళచేతుల్లో పడ్డామంటే వాళ్ళు మనల్ని పాతేస్తారు" అన్నాడు నరసయ్య భయంభయంగా.

"గురువుగారూ! నరసయ్య చెప్పింది నిజమే. వాళ్ళు ముందువెనుకలు ఆలోచించరు" అన్నారు శిష్యులు.

"ఛీ. నోరు ముయ్యండిరా" అంటూ శిష్యుల్ని గదమాయించి "నరసయ్యా, వాళ్ళు ఎంత మూర్ఖులయినా నా మంత్రశక్తి తెలుసుకొన్నారంటే నా కాళ్ళమీద పడతారు. చూస్తుండండి" అంటూ గర్జించాడు.

కానీ నరసయ్య కూడా వెనక్కు-వెనక్కు అడుగులు వేస్తూ కారుదగ్గరకు చేరుకున్నాడు. అతని శిష్యులు పరిస్థితి అయితే పరుగెత్తడానికి సిద్ధంగా వున్నారు. కొద్దిసేపటికి రొప్పుతూ, రోస్తూ బెస్తవాళ్ళంతా భూతవైద్యుడికి ఎదురుగా నిలబడ్డారు. అందరి చేతుల్లోనూ ఒక్కొక్క కర్ర వుంది. నల్లగా వున్నారు. పుట్టగోచీలు తప్ప వాళ్ళ ఒంటిమీద ఏ వస్త్రమూ లేదు.

"ఏందయ్యా నువ్విక్కడ జేసేది? గంగానమ్మకు చేతబడి చేస్తున్నావా" అన్నాడు మెడలో పూసలదండ వున్న వ్యక్తి. అతనే పల్లెపెద్ద.

"ఏమిటీ నన్నే అడుగుతున్నావా?" నేనెవర్ననుకొన్నావురా, భూత ప్రేత పిశాచాల అధినాయకుడ్ని. నేను తలచుకొంటే నా మంత్రశక్తితో మిమ్మల్ని

ముక్కుల క్రింద మార్చి, మీ ఆడవాళ్ళని పిల్లల్ని చేయగలను. ఏమనుకుంటున్నారో ఏమో" భయంకరంగా నవ్వాడు భూత వైద్యుడు.

అందరి ముఖాల్లోను ప్రేతకళ వచ్చింది. భయంగా ఒకరినొకరు చూసుకొన్నారు. తరువాత పల్లెపెద్ద వైపు చూశారు. 'నాయాళ్ళు భయపడిపోయారు. ఇక మనకు దాసులే' అనుకొన్నాడు భూతవైద్యుడు.

"ఇంకా ఏమిట్రా ఆలోచిస్తున్నారు. వచ్చి నాకాళ్ళమీద పడండిరా" అన్నాడు గర్వంగా.

క్షణంలో పల్లెపెద్ద ముఖం మారిపోయింది. "ఠేయ్ కావీయండిరా. భూతవైద్యుడి జుట్టు పెరకండిరా. పళ్ళు ఊడగొట్టండి. అవి రెండూ పోతే వాడి మంత్రాలు పనిచెయ్యవు" అంటూ అరిచాడు.

క్షణంలో బెస్తవాళ్ళంతా భూత వైద్యుడి మీద పడ్డారు. అప్పటికే శ్రీధర్, రాజయ్య, నరసయ్య కారులో కూర్చుని కారుని పరుగెత్తించారు.

ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని పరిగెత్తిన శిష్యులు చప్పున బయలుదేరుతున్న రెండవకారు వెనకడోరు తెరుచుకొని కారులోకి దూరారు. రెండుకార్లూ వాయువేగంతో ఆ ప్రదేశం వదిలి పరుగెత్తాయి.

పల్లెవాళ్ళు భూతవైద్యుడి దుస్తులు చించి, జుట్టుపీకి, అతని తలను కొటిచెట్టుకేసి కొట్టి, భయంకరంగా, రాక్షసంగా చంపేసారు.

ప్రజల్లో మూఢనమ్మకాలను ప్రోత్సహించి, మంత్రతంత్రాలని మభ్యపెట్టి, యింతకాలం ఎంతో సంపాదించిన శంభుదాసు, అదే మూఢనమ్మకాలు గల మంత్రతంత్రాలను నమ్మే ప్రజల చేతుల్లోనే కిరాతకంగా చంపబడ్డాడు. ఒకే కత్తికి రెండువైపులా పదునుగల యీ సమాజం చాల ప్రమాదకరమైనది.

తను వదలిన బాణం తననే బలి కోరుతుందని శంభుదాసు ఎప్పుడూ ఊహించి వుండలేదు.

